ఆనందోత్సాహాలతో భోగి



ఆరిలోవ కాలనీలో భోగి మంట వేస్తున్న స్థానికులు



భోగి మంట వద్ద అదనపు కమిషనర్ సన్యాసి రావు

ఆరిలోవ: భోగి పండగను ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. పలు ప్రాంతాల్లో భోగి మంటలు వేశారు. పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ నుంచి బాలాజీనగర్ వరకు, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారంతో పాటు దీన్‌దయాల్‌పురం నుంచి చినగదిలి వరకు, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం వరకు వీధుల్లో భోగిమంటలు వేశారు. తెల్లవారుజామున పెద్దలు, పిల్లలు కలసి కర్రలు పేర్చి భోగి మంటలు వేశారు. ఆ మంటల చుట్టూ చేరి సరదాగా గడిపారు. పిల్లలు పాటలు పాడుతూ సందడి చేశారు. కొందరు ఇళ్ల వద్ద చిన్న పిల్లలకు భోగిపళ్లు పోశారు. దీంతో ఇక్కడ పల్లెటూరు వాతావరణం నెలకొంది.

పర్యావరణ హితంగా..

బీచ్‌రోడ్డు: ఆవుపేడ పిడకలతో పర్యావరణ హితంగా భోగి మంట వేసినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసి రావు తెలిపారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నేతృత్వంలో ఆదివారం బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద భోగిమంట వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణహితంగా భోగి మంట వేయడం ఆనందదాయకమన్నారు. ఎకో వైజాగ్ అమలవుతున్న విశాఖ నగరంలో టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా మన సంస్కృతి తెలియజేసేవిధంగా గోమయంతో తయారు చేసిన పిడకలు, నెయ్యి, హారతి కర్పూరంతో భోగి మంట వేసినట్టు తెలిపారు. ప్రధానంగా గంగిరెద్దులు విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, యువతల నృత్యాలతో నిర్వహించిన పండగ అందర్నీ ఆకట్టుకుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని, ప్రతి పండగను పర్యావరణానికి ఎటువంటి హాని లేకుండా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్, సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక భోగి పళ్లు

భోగి పండుగను పురస్కరించుకొని బీచ్‌రోడ్డులో ప్రకృతి చికిత్సాలయం ఆవరణంలో చిన్నారులకు సామూహిక భోగి పళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిష్టల, శ్రీలక్ష్మిలు హారతులు ఇచ్చి భోగి పళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.లక్ష్మీ నారాయణ, ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు..



ఆరిలోవ సుందరయ్యకాలనీలో భోగి మంట



చిన్నారులపై భోగిపళ్లు వేస్తున్న మహిళలు



గంగిరెద్దు విన్యాసం

క్లుప్తంగా

కేపీఎల్ విజేత కాపు వారియర్స్



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న రవికుమార్

బీచ్‌రోడ్డు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన కాపు ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ పోటీల విజేతగా కాపు వారియర్స్ నిలిచింది. ఆదివారం ఏయూ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుపాడ రవికుమార్ పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేపీఎల్‌ను వచ్చే ఏడాది జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గౌతమ్, భద్రి,అతిథులుగా రమణ, సాసుబిల్లి కృష్ణ, నర్సింగ్ పాల్గొన్నారు..

జోరుగా గాలిపటాల విక్రయాలు



శంకరమఠం రోడ్డులో విక్రయిస్తున్న గాలి పటాలు

సీతంపేట: సంక్రాంతి పండగ అంటే పిల్లలకు గుర్తొచ్చేది గాలిపటాలు. పండగ సెలవుల్లో గాలిపటాలు ఎగురవేయడానికి పిల్లలు ఉత్సాహం చూపిస్తుంటారు. పిల్లలను ఆకర్షించేలా వివిధ రంగులు, డిజైన్లలో పతంగులను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. శంకరమఠం రోడ్డు, అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో రోడ్డు పక్కన ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. పేపర్, పాలథిన్, క్లాత్‌తో తయారు చేసిన మూడు రకాల గాలిపటాలు అమ్ముతున్నారు. గబ్బిలం , గద్ద , బట్టర్‌ఫ్లై, ఏంజిల్, గుడ్లగూబ, రామచిలుక ఆకారాలలో క్లాత్‌తో తయారు చేసిన గాలిపటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బెన్‌టెన్, స్పైడర్‌మ్యాన్, డోరేమాన్, చోటాభీం, టామ్ అండ్ జెర్రీ, సినీతారల ముఖచిత్రాలతో తయారు చేసిన గాలిపటాలు ఆకర్షిస్తున్నాయి. రూ.5ల నుంచి రూ.300 ధరలతో వీటిని విక్రయిస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

మధురవాడ: సంక్రాంతి సంబరాలు శిల్పారామం జాతరలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. విశాఖపట్నం శ్రీ శివసాయి భరతనాట్య కళా బృందం వారిచే నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. శిల్పారామం అధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

మద్యం మత్తులో న్యాయవాది మృతి

అల్లిపురం : విపరీతంగా మద్యం తాగటంతో న్యాయవాది మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం రొంకాన శ్రీకాంత్ (41) న్యాయవాద వృత్తి చేస్తున్నారు. ఇతను నాలుగు రోజులుగా ఇంటికి వెళ్లకుండా తన కార్యాలయంలోనే మద్యం తాగుతూ ఉండిపోయారు. ఈ నెల 12వ తేదీన ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లలితాకాలనీలో గల ఆఫీసులో ఉన్నానని సమాధానం చెప్పారు. అతని మామయ్య 13వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అతని కార్యాలయానికి వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. సందులో నుంచి చూడగా కింద పడిపోయి వున్నారు. ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా ఫోన్ తీయకపోవటంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అతను ఎంతకీ లేవకపోవటంతో 108కి ఫోన్ చేశారు. వారు చూసి చనిపోయినట్లు తెలిపారు. మృతుని మామ గుండ్ల గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య నృత్య నీరాజనం



ప్రత్యేక పూజలు అందుకున్న సీతారాములు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: బాల సరస్వతి నృత్య నికేతన్ వారు నిర్వహించిన భరతనాట్య నృత్య నీరాజనం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్యలో రామ మందిర ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రామ భక్తులు పాల్గొన్నారు. చిన్నారులు చేసిన నృత్యాలను, భరతనాట్య నృత్య నీరాజనాన్ని వీక్షించారు. కుమారి శృతి రాజ్ కూచిపూడి నృత్య నీరాజనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేద పండితులు శ్రీ సీతారామలక్ష్మణ అంజనేయ స్వామి వారికి ప్రత్యేక హారతి కార్యక్రమాన్ని కనువిందుగా నిర్వహించారు.

ముస్లింలకు సీట్లు ఇచ్చే పార్టీలకే మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ ప్రతినిధులు

వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్

తాటిచెట్లపాలెం: వచ్చే ఎన్నికల్లోల ముస్లింలకు ప్రాధాన్యతను ఇచ్చే పార్టీలకు మా మద్దతు ఉంటుందని వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ సభ్యులు తెలిపారు. ఆదివారం రైల్వే న్యూకాలనీలోని ఓ హోటల్‌లో ముస్లిం నేత హైదర్ ఆలీ సింకా అధ్యక్షతన వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు గల నియోజకవర్గాల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగా చూస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించే పార్టీలకే తాము మద్దతు ఇస్తామని చెప్పారు. సీట్లు కేటాయించని పక్షంలో ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు షేక్‌షరీఫ్, రహమతుల్లా బేగ్, షేక్ మునీర్, షేక్ అహ్మద్ వలీ, హైదర్ ఆలీ సింకా, ముజీబుర్ రెహ్మాన్, అమీర్ జాన్, షేక్ నూర్ అహ్మద్ పలు మసీదుల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా ధారోత్సవాలు



అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులను ఆలయంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై నాలుగోరోజు ఆదివారం ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకీలో, మరో పల్లకీలో సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అధిష్ఠింపజేసి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్ఠింపజేశారు. పాశుర విన్నపం పారాయణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అప్పన్నపాలెం వద్ద బీఆర్‌టీఎస్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందింది. కుటుంబానికి ఆధారంగా ఉన్న మహిళ మృతి వార్త తెలుసుకుని అప్పన్నపాలెం వాసులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు.పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. అప్పన్నపాలెంలో నివాసం ఉంటున్న గొలగాని అప్పలకొండ(57) స్థానికంగా పలు ఇళ్లలో పని చేస్తుంది. భర్త అప్పారావు, కొడుకు, కూతరుతో అప్పన్నపాలెంలో నివాసం ఉంటోంది. భర్త అప్పారావు నడవలేని స్థితిలో ఉంటున్నాడు. కొడుగు డిగ్రీ పూర్తిచేశాడు. కూతరు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇళ్లలో పనిచేస్తూ కుటుంబానికి అప్పలకొండ ఆధారంగా ఉంది. కాగా ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో అప్పన్నపాలెం వద్ద అప్పలకొండ రోడ్డు దాటుతుండగా బీఆర్‌టీఎస్ రోడ్డులో పాత గోశాల నుంచి వేపగుంట వైపు వెళ్తున్న ఆర్టీసీబస్ ఆమెను ఢీకొట్టింది. టైరు కింద పడిపోవడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అప్పలకొండ బంధవులు, అప్పన్నపాలెం నివాసితులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బజార్లు కిటకిట



రద్దీగా ఉన్న సీతమ్మధార రైతుబజారు

కంచరపాలెం/సీతమ్మధార (విశాఖ ఉత్తర): కంచరపాలెం, సీతమ్మధార రైతు బజార్లు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. దేవ గుమ్మడి, చెరకు గడలు, కూర పెండలం, చిలగడ దుంపలతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు, పూజ సామగ్రి, పండ్లు, పువ్వులు, పసుపుకుంకుం, ఆకులు, వక్కలు, కొబ్బరికాయల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. కొనుగోలు దారులతో రైతు బజార్లు సందడిగా మారాయి. అల్లూరి,అనకాపల్లి జిల్లాల్లోని అరకు, కృష్ణదేవిపేట, నర్సీపట్నం, దేవరాపల్లి సబ్బవరం, కొత్తవలసతో పాటు రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి దుంపలు, చెరకు గడలను విక్రయానికి భారీగా తీసుకువచ్చారు. రైతులు ఎక్కువ ధరలకు అమ్మకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ మద్దిలపేటకు చెందిన కనకల వెంకటేష్ (29) అనే రైతు విద్యుదాఘాతంలో శనివారం రాత్రి మృతి చెందాడు. పద్మనాభం మండలం మద్దిలో ఇటుకబట్టీలు కలిగిన వెంకటేష్ అక్కడ పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. కాళ్లు కడుగుకునేందుకు మోటార్ ఆన్ చేయగా బయటకు వచ్చిన విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య అంజలి, మూడేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. పండగపూట గ్రామస్తులంతా విషాదంలో మునిగిపోయారు.

కమనీయం.. గోదా రంగనాథుల కల్యాణం



సింహగిరిపై వేదికపై వెంకన్న, గోదాదేవి, శ్రీదేవి, భూదేవి కల్యాణ ఉత్సవమూర్తులు



పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. 85 మంది ఉభయదాతలు కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణలో మునిగితేలారు. వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తిని రంగనాథుడిగా అలంకరించారు. గోదాదేవిని పెళ్లి కూతురుగా ముస్తాబు చేశారు. వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు మధ్య ఆలయంలోంచి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నేత్రపర్వంగా జరిపారు. అడవివరం గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు స్వామిని దర్శించుకున్నారు.

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా గోదా దేవి, అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను గోస్తనీ నదిలోకి తీసుకెళ్లి నీలాటోత్సవం నిర్వహించారు. తదుపరి గోదాదేవి, రంగనాథుల విగ్రహాలకు అర్చక స్వాములు కల్యాణం జరిపించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో నానాజీబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు. పొట్నూరులోని కోదండ రామ స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఏవీఆర్ శర్మ సహాయంతో అర్చక స్వాములు కల్యాణం నిర్వహించారు.

ఇల వైకుంఠం బల్లిగిరి

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవ స్థానం ఆదివారం వైకుంఠాన్ని తలపించింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా దేవస్థానం కల్యాణ మండపంలో కమనీయంగా గోదారంగనాథుల కల్యాణం నిర్వహించా రు. గోదాదేవి, రంగనాథులు భక్తులకు కల్యాణ మూర్తులుగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘనాథాచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. గోదాదేవి రంగనాథుని కల్యాణం చేసుకునేందుకు నెల రోజుల పాటు ధనుర్మాసంలో ఆయనను స్తుతిస్తూ రచించిన తిరుప్పావై పాశురములు, వాటి విశిష్టతను భక్తులకు వివరించారు. నెలరోజుల పాటు ఆమె చేసిన పూజల ఫలితంగా సాక్షాత్తు రంగనాథుడు గోదాదేవిని కల్యాణం చేసుకున్నారని వివరించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి దేవదాయ శాఖ తరఫున గోదారంగనాథులకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు దేవస్థానంలో కల్యాణ విందు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.